
సాక్షి గుంటూరు

ఆదివారం। 16। మార్చి। 2025



వైభవంగా సాయినాథ వార్షికోత్సవం


ఫిరంగిపురం: ఫిరంగిపురం సొలస బస్టాండు సమీపంలోని సాయినాథ మందిర వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు చేశారు.



అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

మాచర్ల: మాచర్ల శ్రీశైలం రోడ్డులోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవం



దాచేపల్లి: స్థానిక వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయం 9వ వార్షికోత్సవ పూజలు శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
గుంటూరు	6.23	4.58
నరసరావుపేట	6.25	5.00
బాపట్ల	6.23	4.58

కుట్ర రాజకీయాలపై ఉగ్రరూపం

అధికారం అండ చూసుకుని కాల'కూటమి' విషం చిమ్ముతూనే ఉంది. గుంటూరు నగరపాలక సంస్థపై పెత్తనం చలాయించడానికి మాయోపాయాలు పన్నుతూనే ఉంది. నిస్సిగ్గుగా సంతలో పశువులను కొన్నట్లు కార్పొరేటర్లను కొన్న కూటమి నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. కమిషనర్‌ను అడ్డం పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారు. అడుగడుగునా మేయర్ కావటిని అవమానపరున్నారు. నగరపాలక సంస్థపై కూటమి పెత్తనంపై నిరసన వ్యక్తం చేస్తూ ఆయన పదవికి రాజీనామా చేశారు. ఇటు జిల్లా పరిషత్‌లోనూ చైర్‌పర్సన్ అరాచకాలకు అడ్డూఅదుపూ లేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇచ్చేస్తున్నారు. దీన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు బడ్జెట్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు.

- వేడెక్కిన గుంటూరు జిల్లా రాజకీయం
- ఒకే రోజు రెండు పరిణామాలు
- మేయర్ పదవికి కావటి మనోహర్ రాజీనామా
- జెడ్పీ సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు
- కోరం లేక వాయిదా
- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ నిర్ణయాలు



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఖాళీగా ఉన్న వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుల స్థానాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొనుగోలు చేస్తూ, ప్రజలతో ఎన్నుకోబడిన స్థానిక సంస్థలను అపహాస్యం చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని నిరసిస్తూ గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పదవికి శనివారం రాజీనామా చేశారు. మరోవైపు అధికారాన్ని అడ్డం పెట్టుకుని బడ్జెట్ ఆమోదించకుండానే రూ. 12 కోట్ల విలువైన పనులను ముందుగానే ఆమోదించుకోవడానికి జెడ్పీ చైర్‌పర్సన్ పేరుతో కూటమి ప్రజా ప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాన్ని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు అడ్డుకున్నారు. సమావేశానికి వారు రాకపోవడంతో కోరం లేక వాయిదా వేయాల్సి వచ్చింది.

సంతలో పశువుల్లా కార్పొరేటర్ల కొనుగోలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికి గుంటూరు నగరపాలక సంస్థలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం పూర్తి మెజార్టీతో అధికారంలో ఉంది. ఎలాగైనా దొడ్డిదారిలో స్థాయీ సంఘాన్ని దక్కించుకునేందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు కుట్ర పన్నారు. కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసి సంతలో పశువులను కొన్నట్లు కొనుగోళ్లకు తెర లేపారు. వారే స్వయంగా కార్పొరేటర్ల ఇంటికి వెళ్లి మరీ కండువాలు కప్పి వచ్చారు.

వంత పాడుతున్న కమిషనర్

నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కూడా రాజకీయ నాయకుడిలా టీడీపీ నేతల వంత పాడారు. చిన్న అంశాన్ని అడ్డం పెట్టుకుని కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేసిన ఆయన తర్వాత మేయర్ ఎన్నిసార్లు లేఖలు రాసినా కౌన్సిల్ సమావేశం పెట్టకుండా అడ్డం పడ్డారు. దొడ్డిదారిన స్థాయీ సంఘాన్ని అందిపుచ్చుకున్న తర్వాత ఎమ్మెల్సీ కోడ్ ముగియడంతో తాజాగా మేయర్ ప్రమేయం లేకుండానే స్థాయీ సంఘం సమావేశం తేదీని నిర్ణయించి ప్రకటించేశారు. అజెండా విషయంలో కూడా మేయర్‌ను సంప్రదించలేదు.

మేయర్‌కు అవమానాలు



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఆటల పోటీల విషయంలో గానీ, తర్వాత జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి మేయర్‌కు ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా అవమానిస్తూ వచ్చారు. పైగా మేయర్ వద్ద ఉన్న సిబ్బందిని కుదించి వేశారు. కారును, డ్రైవర్‌ను, అటెండర్‌ను, ఆఫీస్ స్టాఫ్‌ను, అఖరి బిళ్ల బంట్రోతును కూడా తీసేశారు. చాంబర్‌కు వస్తే తాళాలు వేసి పావుగంట సేపు బయట నిలబడేలా చేశారు. మరోవైపు మేయర్‌ను దింపివేసి తమ అభ్యర్థిని బరిలోకి నిలబెడుతున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర పేరును ప్రకటించారు. మేయర్ పదవిని దక్కించుకునేందుకు మిగిలిన కార్పొరేటర్లతో మంతనాలు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో ఈ అవమానాలను నిరసిస్తూ మేయర్ కావటి మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పెత్తనం



మరోవైపు శనివారం జరగాల్సిన జెడ్పీ సభ్య సమావేశాన్ని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు బాయ్‌కాట్ చేయడంతో కోరం లేక వాయిదా పడింది. జిల్లా ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో 82 మంది సభ్యులు ఉండగా 27 మంది హాజరైతేనే కోరం వస్తుంది. కేవలం 13 మందే హాజరు కావడంతో వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రజల ఓట్లతో గెలిచిన తమకు జెడ్పీలో కనీస గౌరవం లేకుండా పోయిందని జెడ్పీటీసీ సభ్యులు ఆరోపిస్తున్నారు. బడ్జెట్ ఆమోదం పొందకుండానే ముందస్తు అనుమతుల పేరుతో జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు మంజూరు చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తున్నారు. వాటిల్లో కమీషన్లు, పర్సంటేజీలకు కక్కుర్తి పడి రూ. 12 కోట్ల విలువైన పనులకు అనుమతులు ఇచ్చేశారు. ప్రజాధనాన్ని పరిరక్షించడం కోసం 42 మంది జెడ్పీటీసీ సభ్యులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడంతో బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

ప్రజల భాగస్వామ్యంతోనే 'స్వచ్ఛ మంగళగిరి' సాధ్యం



మంగళగిరి టౌన్: స్వచ్ఛ మంగళగిరి ఉద్యమంలో నియోజకవర్గ ప్రజలు భాగస్వాములు కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శనివారం మంత్రి పాల్గొన్నారు. మొదట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత స్టాల్స్‌ను పరిశీలించారు. డ్రాయింగ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పాత్రాలు అందజేశారు. స్వచ్ఛ మంగళగిరి పోస్టర్‌ను, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అధికారులు, నాయకులు, విద్యార్థులతో స్వచ్ఛ మంగళగిరి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని చెప్పారు. ఇంట్లోని చెత్తను బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో వేయకుండా ప్రతిరోజు ఇంటి ముందుకు వచ్చే నగరపాలక సంస్థ వాహనాలకు అందజేయాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని చెప్పారు. కోరిన వెంటనే ఎస్ఏఈఎల్, దివిస్ సంస్థలు సీఎస్ఆర్ కింద నిధులు ఇవ్వడంతో పాటు స్వచ్ఛ మంగళగిరికి సపోర్ట్ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్ఏఈఎల్ సంస్థ రూ. 1.25కోట్లతో అన్ని సచివాలయాలకు శానిటేషన్ కిట్స్ అందజేయగా, దివిస్ సంస్థ స్వచ్ఛ అంబాసిడర్స్‌కి జీతాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛ మంగళగిరి ప్రత్యేక డ్రైవ్ ద్వారా 365 రోజుల్లో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను దేశంలోనే చెత్త రహిత కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని పిలుపునిచ్చారు. త్వరలో భూగర్భ డ్రైనేజీ, భూగర్భ విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మల్లేశ్వరస్వామి సేవలో ఉప లోకాయుక్త జస్టిస్ రజిని



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని శనివారం ఆంధ్రప్రదేశ్ ఉప లోకాయుక్త జస్టిస్ పి. రజిని దంపతులు సందర్శించారు. ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్‌తో పాటు అర్చకులు, వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు. తొలుత రజిని దంపతులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ న్యాయమూర్తి దంపతులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ముగిసిన సీనియర్ ఇంటర్ పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు శనివారం ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 87 పరీక్ష కేంద్రాల పరిధిలో 29,405 మందికి గానూ 28,901 మంది హాజరయ్యారు. ఆర్ఐవో జీకే జుబేర్ నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల మొత్తానికి గానూ జిల్లాలో ఒక మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రాతః కాల ఆరాధన, స్వామికి తిరుమంజన స్నపన, అలంకార పూజ, నిత్యార్చన, నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని అర్చకులు భక్తిప్రపత్తులతో చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో తిలకించారు. ఆలయ కమిటీ అన్న ప్రసాద వితరణ చేసింది. సాయంత్రం నిత్య హోమం నిర్వహించారు. అనంతరం, స్వామివారి రథోత్సవం భక్తుల గోవింద నామస్మరణతో ఆర్.అగ్రహారం ప్రధాన వీధుల్లో కొనసాగింది. మంగళ వాయిద్యాలు, డప్పులు, దేవతామూర్తుల వేషధారణలతో రథోత్సవం ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్యానాయుడు, దాసరి భాస్కరరావు పాల్గొన్నారు.

రేపు న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి శనివారం తెలిపారు. టోర్నమెంట్ సోమవారం 8:30గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. స్పోర్ట్స్ అండ్ కల్చర్ కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఈసీ మెంబర్స్ ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

చూసిన కనులదే భాగ్యం..!



ఆలయం ముందు ఏర్పాటు చేసిన శ్రీనివాస కల్యాణ వేదిక



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి తదితరులు

తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని టీటీడీ ఆలయంలో శనివారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. స్వామిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ దర్శించుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు.

– తాడికొండ

వైభవంగా నృసింహుడి వసంతోత్సవం



స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

- ధ్వజారోహణం, కేళీ గుర్రంపై విహారం
- దొంగల దోపిడీతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

మంగళగిరి: మంగళాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శుక్రవారం అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తులతో సాగిన స్వామి దివ్య రథోత్సవంతో ఉత్సవాలు చివర దశకు చేరాయి. శనివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. కైంకర్యపరులుగా నిడమర్రుకు చెందిన కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, ఛాయాదేవి దంపతులు వ్యవహరించారు. రాత్రి స్వామికి ధ్వజావరోహణం, కేళీ గుర్రంపై విహారం, దొంగల దోపిడీ నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవం అనంతరం స్వామి వసంతోత్సవం జరుపుకుంటూ పురవీధుల్లో విహరించారు. కోనేరు వద్ద చక్రస్నానం చేశారు. స్వామితో పాటు కోనేరులో స్నానం చేయడం వల్ల మోక్షప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. అనంతరం పూర్ణాహుతి, ధ్వజావరోహణం నిర్వహించారు. ఈ ఉత్సవంలో గరుత్మంతుడు మొదట పిలిచిన దేవతలందరినీ తిరిగి వారి స్థానాలకు పంపుతాడు. అనంతరం స్వామి కేళీ గుర్రంపై పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

నృసింహుని సేవలో ఉప లోకాయుక్త రిజిస్ట్రార్ రజిని

శ్రీ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ రజిని దంపతులు దర్శించుకున్నారు. ఎగువ దిగువ సన్నిధులలో స్వామిని దర్శించుకున్న దంపతులకు ఆలయ ఈవో, సహాయ కమిషనర్ ఏ. రామకోటిరెడ్డి, తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర ఘనంగా స్వాగతం పలికారు. రజిని దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జెడ్పీటీసీలకు సముచిత గౌరవం లేదు

- జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా నిధులు మంజూరు చేయడం తగదు
- కమీషన్లు, పర్సంటేజ్‌లు దండుకుంటున్నారు
- చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టిన వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా పనిచేయడం సహించలేకున్నాం
- మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రజల ఓట్లతో గెలిచిన తమకు కనీస గౌరవం, సముచిత స్థానం కరువయ్యాయని వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జెడ్పీలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన జెడ్పీటీసీలు బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

పార్టీ అధినేతపై అనుచిత వ్యాఖ్యలు

రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత జెడ్పీ ఎన్నికల్లో కత్తెర హెనీ క్రిస్టినాకు జెడ్పీటీసీగా గెలిపించడంతోపాటు చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీలోకి వెళ్లిన క్రిస్టినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎంతో ఆవేదనకు గురి చేశాయని చెప్పారు. ప్రజల ఓట్లతో గెలిచిన జెడ్పీటీసీలకు గౌరవం ఇవ్వకపోగా, ముందస్తు అనుమతుల పేరుతో జెడ్పీ చైర్‌పర్సన్ నేరుగా సంతకాలు చేసి పనులు మంజూరు చేస్తున్నారని అన్నారు. జెడ్పీటీసీల ప్రమేయం లేకుండా, సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకురాకుండా పనులు మంజూరు చేస్తున్నప్పుడు ఇక తమకు విలువ ఎక్కడిదని ప్రశ్నించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులతో, అత్యవసర పనుల పేరుతో కోట్లాది రూపాయల విలువైన పనులకు ముందస్తు అనుమతులు ఇస్తూ, వాటిలో కమీషన్లు, పర్సంటేజీలు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జరగాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతోపాటు రూ.12 కోట్ల విలువైన పనులకు ముందస్తు అనుమతులను చైర్‌పర్సన్ ఇచ్చేశారని చెప్పారు. తామందరం సమావేశానికి వెళ్లి ఉంటే తమ అంగీకారం లేకున్నా, కోరం ఉందనే సాకుతో బడ్జెట్‌ను ఆమోదించడంతోపాటు సంబంధిత రూ.12 కోట్ల పనులను తమ అంగీకారం లేకుండా ఆమోదించుకునే వారని చెప్పారు. ప్రజాధనం వృథా కారాదనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీకి చెందిన 42 మంది సభ్యులు సమావేశాన్ని బహిష్కరించినట్లు పేర్కొన్నారు. అసలు ముందస్తు అనుమతులు అనే మాట పంచాయతీరాజ్ చట్టంలోనే లేదన్నారు.

ఏకపక్షంగా కేటాయింపులు

ప్రత్తిపాడు జెడ్పీటీసీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా జెడ్పీటీసీలకు తెలియకుండా ఏకపక్షంగా నిధులు మంజూరు చేస్తూ, జెడ్పీని ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అత్యవసర పనుల పేరుతో ధనార్జనే ధ్యేయంగా పనులు ఆమోదిస్తూ, కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు.

జెడ్పీటీసీలకు ప్రాధాన్యమెక్కడ?

కాకుమాను జెడ్పీటీసీ గుల్జాన్‌బేగం మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా జెడ్పీటీసీలకు ప్రాధాన్యం కల్పించడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి గెలిచిన 56 మంది సభ్యులుగా తాము పార్టీని నమ్ముకుని ఉండగా, కొంత మంది రాజకీయ ప్రయోజనాలతో పార్టీని వీడారని ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులుగా తమ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు తాము ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి ఉందని, జెడ్పీలో జరుగుతున్న కార్యకలాపాలు, నిధుల మంజూరుపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత చైర్‌పర్సన్‌కు ఉందన్నారు. పార్టీని వీడే ముందు జెడ్పీటీసీలుగా తమను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, కేవలం వ్యక్తిగత ప్రయోజనాలు మినహా, ప్రజాప్రయోజనాలు లేవని తెలిపారు. సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 7,000 గరిష్ఠం : రూ. 8,800

మోడల్ ధర రూ. 7,900

క్లుప్తంగా

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి తెలిపారు. అభ్యర్థుల వివరాలను గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

ఏఎన్ఎం ప్రమోషన్ జాబితా సిద్ధం

గుంటూరు మెడికల్: ఎంపీహెచ్ఏ ఫిమేల్‌గా పని చేస్తూ ఏఎన్ఎం గ్రేడ్–3 ప్రమోషన్ కోసం అర్హులైన అభ్యర్థుల జాబితాలను విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. మొత్తం 266 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌ను ఈనెల 17న గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని వెల్లడించారు.

ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి

అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ(డి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జేబీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఎస్టీయూ(డి) సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘం మండల అధ్యక్షుడు జి.ఆనందరావు అధ్యక్షత వహించారు. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అరుణారావు మాట్లాడుతూ పీఆర్సీపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎం.సాంబశివరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఎంఈఓ వై.ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మంటి సాంబశివరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా అంకం బుజ్జిబాబు, అధ్యక్షుడిగా జి. ఆనందరావు, ఉపాధ్యక్షులుగా పీఎస్ కుమారి, శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎం.ఆదాలు, సహాయ కార్యదర్శులుగా షేక్ షారాబీ, బైమున్నీసా, మహిళా కార్యదర్శిగా అన్నం వేణుకుమారి, ఆర్థిక కార్యదర్శిగా కుంభా సాంబశివరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వి.అరుణరావు, ఎం.సాంబశివరావు, డి.కోటేశ్వరరావులు ఎంపికయ్యారు.

గెలుపే లక్ష్యం.. అలుపెరగని పోరాటం

- గ్రూప్–1 ఆఫీసర్‌గా అరవింద్ ఎంపిక
- నాలుగు సార్లు సివిల్స్ మెయిన్స్ వరకు వెళ్లినా నిరాశ
- పంచాయతీ సెక్రటరీగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూనే పరీక్షలకు సిద్ధం
- ప్రస్తుత వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతల నిర్వహణ

లక్ష్య సాధనలో అపజయాలు ఎదురైనా కుంగిపోలేదు. సివిల్స్‌లో నిరాశ ఎదురైనా ఆగిపోలేదు. ఆత్మ విశ్వాసంతో తన గమ్యాన్ని, ప్రయాణాన్ని మార్చుకుని గ్రూప్–1 ఆఫీసర్‌గా అరవింద్ ఎంపికయ్యారు. పంచాయతీ సెక్రటరీగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసినా ఆ ఉద్యోగాలతో సంతృప్తి లేదు. జీవన సమరంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ తన గమ్యాన్ని, లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రస్తుత వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

లక్ష్మీపురం: కర్నూలుకు చెందిన కదారుకొండ ఓంకార్ సీనియర్ న్యాయవాది. ఆయన భార్య రేవతి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమారుడు కె.సాయి తేజ డాక్టర్. రెండో కుమారుడు కె. అరవింద్ ప్రస్తుతం గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా పని చేస్తున్నారు. భార్య సామా శ్వేత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉన్నారు. వీరికి రణ్‌విత్ అనే కుమారుడు ఉన్నాడు.

సివిల్స్‌లో అపజయం

అరవింద్ 2015లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఇప్పుడు ఈగల్ ఐజీగా ఉన్న ఆకే రవికృష్ణ కర్నూల్ ఎస్పీగా ఉండేవారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని తరచూ కలిసేవారు. సివిల్ సర్వీసెస్‌కు కావాల్సిన మెళకువలు తెలుసుకుంటూ ఉండేవారు. ఆ సమయంలో క్యాంపస్ సెలక్షన్స్‌లో టీసీఎస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దాంతో సంతృప్తి చెందలేదు. సివిల్ సర్వీసెస్ అధికారి కావాలన్న అరవింద్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఇంజినీరింగ్ పూర్తయిన వెంటనే హైదరాబాద్‌లోని ఆర్సీ రెడ్డి సివిల్స్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. 2016లో మెయిన్స్ వరకు వెళ్లి వెనుదిరిగారు. మరలా శిక్షణ కొనసాగుతున్న సమయంలో 2016–17 హైదరాబాద్‌లో యాక్సెంచర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా ఉద్యోగ అవకాశం దక్కింది. సివిల్స్ శిక్షణ పొందుతూనే కుటుంబానికి భారం కాకూడదని ఏడాదిన్నరపాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేశారు. ఆ సమయంలో హైదరాబాద్‌కు చెందిన సామా శ్వేత అదే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నారు. ఆమెతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. 2020 అక్టోబర్ 29న ఇద్దరు వివాహం చేసుకున్నారు. మరలా 2017లో గ్రూప్–1 పరీక్షలకు హాజరై మెయిన్స్ వరకు వెళ్లి అరవింద్ వెనుదిరిగారు. మరలా 2018, 2019, 2020లో సివిల్స్ మెయిన్స్ వరకు వెళ్లి చివరి దశలో నెగ్గలేక పోయారు. అయితే, భార్య, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో 2020లో పూర్తిగా గ్రూప్–1కు శిక్షణ పొందడం ప్రారంభించారు. ఆ సమయంలో 2019–2022 వరకు కర్నూల్ నగరంలో పంచాయితీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం చేశారు. 2018లో గ్రూప్– 1 మరలా రాశారు. 2022 జులైలో వచ్చిన ఫలితాల్లో గ్రూప్– 1 ఆఫీసర్‌గా అత్యధిక ఉత్తీర్ణతతో సాధించారు. 2022 సెప్టెంబర్ నుంచి 2023 అక్టోబర్ వరకు అనంతపూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో డీఎస్పీగా శిక్షణ పొందారు. 2023 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు వెస్ట్ గోదావరి భీమవరంలో ట్రైనీ డీఎస్పీగా పని చేశారు. 2024–2025 జనవరి వరకు వైజాగ్ గ్రే హౌండ్స్‌లో బాధ్యతలు నిర్వహించారు. 2025 జనవరి 20న లా అండ్ ఆర్డర్ విభాగంలో గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.



వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అరవింద్‌తో సతీమణి శ్వేత


సివిల్ సర్వెంట్ కావాలని కలలు



చిన్నతనం నుంచి ఐపీఎస్ కావాలన్న లక్ష్యం ఉండేది. సివిల్స్‌లో అపజయం ఎదురైనా నిరాశ చెందలేదు. తల్లిదండ్రులు, సోదరుడు ఎంతో ప్రోత్సహించారు. వివాహం అయిన తరువాత నా భార్య శ్వేత కూడా ప్రోత్సహించేది. ఎన్నసార్లు పడినా, లేచి నిలబడగలగం అనే మనో ధైర్యం ఉండాలి. ఎలాగైనా సాధించి తీరాలన్న దృఢసంకల్పం ఉంటే ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొగలం. గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

– అరవింద్

సావిత్రీబాయి పూలే పుస్తకావిష్కరణ



సుజాతను సత్కరిస్తున్న కత్తి పద్మారావు

పొన్నూరు: పట్టణంలోని లుంబినీ వనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటరులో కవి డాక్టర్ కత్తి పద్మారావు రచించిన 'సావిత్రీబాయి పూలే' పుస్తకాన్ని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ గుంటూరు జిల్లా కన్వీనర్ పిల్లి సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జీవిత కథను పుస్తక రూపంలో ప్రపంచానికి తెలియ చేసిన డాక్టర్ కత్తి పద్మారావును అభినందించారు. భారత దేశంలో ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థలు వెలిగించిన ఒక మహోజ్వల కాంతి దీపం సావిత్రీ బాయి పూలే అని పేర్కొన్నారు. ఆ మహనీయురాలి పుస్తకాన్ని ప్రతి మహిళ చెంతకు చేరుస్తానని తెలిపారు. అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్ గుంటూరు జిల్లా కన్వీనర్‌గా సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుజాతను పద్మారావు సత్కరించారు.

ముప్పా చిన బాపిరెడ్డి ట్రస్టుకు 'వాలాగ్రో' విరాళం

పెదపరిమి(తాడికొండ): ఆశ్రమం పేరిట వృద్ధులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ పేరిట ముప్పా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ గొప్ప సహాయ సహకారాలు అందిస్తోందని వాలాగ్రో బయో సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫైనాన్షియల్ హెడ్ రామకృష్ణ ప్రశంసించారు. శనివారం హైదరాబాదుకు చెందిన ఆ సంస్థ సభ్యులు తుళ్లూరు మండలం పెదపరిమిలోని ముప్పా ట్రస్టు క్యాంపస్‌ను సందర్శించారు. సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.8.70 లక్షల చెక్కును ట్రస్టు సభ్యులు వంగా సాంబిరెడ్డి, మున్నంగి శ్రీనివాసరెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పాతికేళ్లకు పైగా ట్రస్టు నిబద్ధతతో పని చేయడం అభినందనీయమని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ ఎంపీ రామిరెడ్డి మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా విద్య, వైద్యం, మహిళా సాధికారత అంశాలపై తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తూ ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 1000 మంది శిక్షణ పొందగా, 700 మందికి పైగా ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. వృద్ధులకు అధునాతన సదుపాయాల ద్వారా సొంతింటి వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వాలాగ్రో కంపెనీ హెచ్ఆర్ హెడ్ తుమ్మూరు రఘురామిరెడ్డి, కంపెనీ ఉద్యోగులు నరేంద్ర, శ్యామ్, సురేంద్ర, పలువురు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న వాలాగ్రో ఫైనాన్సియల్ హెడ్ రామకృష్ణ

నేడు మహా శైవక్షేత్రం పునఃప్రతిష్టా మహోత్సవం

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో మహాశైవక్షేత్ర పునఃప్రతిష్ట మహోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పల్నాటి తొలి మహిళా మంత్రిణి నాయకురాలు నాగమ్మ 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ మహాశైవక్షేత్రం శిథిలావస్థకు చేరుకోవటంతో పునఃప్రతిష్ట చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సుమారుగా 15 ఎకరాల విస్తీర్ణంలోని మహాశైవక్షేత్రంలో పలు దేవాలయాల నిర్మాణాలు, ముఖద్వారాలు, మండపాలు నిర్మాణం కోసం ఏర్పాట్లు చేశారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి పర్యవేక్షణలో మహాశైవక్షేత్రం పనులు జరుగుతున్నాయి. పునఃప్రతిష్టకి సంబంధించిన పనులు పూర్తి చేశారు. పురాతన ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో పందిళ్లు ఏర్పాటు చేశారు. పుణ్యదంపతులు ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు.

విత్తన గుళికల విధానంతో మేలు

ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల్లో రైతులు భూమిని కప్పి ఉంచే విత్తన గుళికల తయారీ విధానాన్ని అవలంభించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో సిబ్బందికి నిర్వహిస్తున్న మూడవ రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరయ్యారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ వేసవిలో ప్రతి రైతు తనకున్న పొలంలో ఈ విత్తన గుళికల విధానం ఆచరించాలని తెలిపారు. దీని ద్వారా భూమిలో తేమశాతం, కార్బన్ ఆవిరి కాకుండా ఉంటాయని తెలిపారు. కార్బన్ శాతం పెరగడం వలన తరువాత సాగుచేసే ప్రధాన పంటకు చీడపీడల ఉధృతి తగ్గుతుందని, మొక్కకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఈ విధానం వలన రైతులకు రసాయన ఎరువులకు అయ్యే ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ విత్తనాలు భూమిలో ఆరునెలల పాటు ఎటువంటి చీడపీడల ఆశించకుండా కొద్దిపాటి వర్షానికే మొలకెత్తుతాయని తెలిపారు. దీని ద్వారా రైతు కుటుంబానికి అవసరమైన ఆకుకూరలు లభించడంతో పాటు పశువులకు మేత లభిస్తుందని చెప్పారు. జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమేక్‌రాజు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం సభ్యులు కేపీసీ కార్యక్రమంలో పాల్గొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షకుడు సైదయ్య, ఎస్ఎఫ్ఏలు నందకుమార్, అప్పలరాజు, మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి పాటుపడాలి

జిల్లా పంచాయతీ అధికారి బి.వి.సాయికుమార్

పొన్నెకల్లు(తాడికొండ): స్వచ్ఛాంధ్ర నిర్మాణం కోసం అందరూ పాటు పడాలని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బీవీ సాయికుమార్ తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు పంచాయతీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ ప్రకృతి కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. స్వచ్ఛతను పాటించడం ద్వారా స్వచ్ఛ గ్రామాలను నిర్మించుకోవచ్చని చెప్పారు. అనంతరం చెరువు గట్టుపై మొక్కలు నాటారు. ర్యాలీ నిర్వహించి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామస్తులకు తడిచెత్త, పొడిచెత్త డబ్బాలు, మిత్రాలకు ఆప్రాన్, గ్లౌజులు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె. శ్రీనివాసరావు, తహసీల్దార్ పి. మెహర్ కుమార్, ఈవోపీఆర్డీ కె. సాయిలీల, కార్యదర్శి షేక్ మహమ్మద్ జాని, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



తడిచెత్త, పొడిచెత్త డబ్బాలు అందజేస్తున్న డీపీవో, అధికారులు

కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

బాపట్ల: కల్తీ పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని డీఎస్ఓ ఇ.బి.విలియమ్స్ పేర్కొన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వెదుళ్లపల్లి హైస్కూలులో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్ఓ మాట్లాడుతూ విద్యార్థులు కల్తీ ఉన్న ఆహార పదార్థాలను తినటం వలన తీవ్ర ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని తెలిపారు. తూనికలు, కొలతల్లో ఉండే మోసాలపై కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్, సమాచార కేంద్ర కన్వీనర్ డి.ఇమ్మానియేల్, తూనికలు కొలతల శాఖ అధికారి రామ్‌దాస్, జిల్లా సైన్స్ అధికారి సాదిక్, ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సాంకేతికతను రైతుల చెంతకు చేర్చాలి

- న్యూఢిల్లీలోని ఐకార్ – ఐఏఆర్ఐ డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు
- విజ్ఞాన్ – ఐఐఓపీఆర్ మధ్య అవగాహన ఒప్పందం

చేబ్రోలు: పరిశోధనల్లో అభివృద్ధి, సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లాలని న్యూఢిల్లీలోని ఐకార్ – ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''అకడమియా ఇండస్ట్రీ ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్''ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ– ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సంబంధిత పత్రాలను వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్‌కు అందజేశారు. కార్యక్రమానికి అనేక విద్యా సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని తెలిపారు. అకడెమియా–ఇండస్ట్రీ–ఫార్మర్ మధ్య సహకారాన్ని బలపరచాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి సాంకేతికత, పరిశోధన, పరిశ్రమలతో పాటు రైతుల మధ్య భాగస్వామ్యం కీలకమని చెప్పారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు వ్యవసాయంలో ఇన్నోవేషన్, సస్టైనబిలిటీ, టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ, హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ సి.తారా సత్యవతి, రాజమండ్రిలోని సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో వైస్ చాన్సలర్ నాగభూషణ్, ఐఐఓపీఆర్ డైరెక్టర్ సురేష్

కోనేటి రాయుడికి నీరాజనాలు



తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన దేవరంపాడు కొండపై స్వయంభూగా వెలసిన నేతి వెంకన్నస్వామి మూడవ శనివారం తిరుణాళ్లకు భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాల నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకునే సమయంలో గోవింద నామస్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలంటు నీరాజనాలు అందించారు. భక్తులు స్వామివారికి పొంగళ్లుచేసి నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. తిరునాళ్లలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ గణపతి సురేష్ ఏర్పాట్లు పరిశీలించారు. హుండీలు, విరాళాలు, స్పెషల్, శీఘ్ర దర్శనాలు, తల నీలాలు, లడ్డు, ప్రసాదాల ద్వారా రూ 13,47,259లు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.